



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు

పుట్టగొడుగుల్లా ల్యాబ్‌లు..



- అనుమతుల్లేకుండానే రక్త పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- మరికొన్ని రెన్యువల్ చేయకుండానే నిర్వహిస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న వైద్య శాఖ అధికారులు

రక్త పరీక్షా కేంద్రాల్లో నిబంధనలు అమలు కాని పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశాఖ అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో ల్యాబ్ యాజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని కేంద్రాలను అనుమతులు లేకుండానే నడుపుతుండగా మరికొన్ని రెన్యువల్ చేయకుండానే పరీక్షలను కొనసాగిస్తున్నాయి. ప్రజల రోగనిర్ధారణలో అత్యంత కీలకంగా ఉన్న రక్త పరీక్షా కేంద్రాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో దాదాపు వంద రక్త పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 60 వరకూ ఉన్నాయి. రెండు జిల్లాల్లోనూ రక్తపరీక్షా కేంద్రాలపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జ్వరం నుంచి శరీరంలో ఏసమస్య వచ్చినా రక్తపరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాతే డాక్టర్లు వైద్యం అందిస్తారు. రక్త పరీక్షా కేంద్రాల ఏర్పాటు, వాటి అమలుపై అనేక నిబంధనలు ఉన్నాయి. ఆరోగ్యశాఖ విధించిన నిబంధనలను రక్తపరీక్షా కేంద్రాల్లో ఎక్కడా పాటించడం లేదు. రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోని పరిస్థితి కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి రక్త పరీక్షా కేంద్రం వద్ద ఏ టెస్ట్‌కు ఎంత ఫీజు అనేది పట్టిక రూపంలో ఏర్పాటు చేయాలి. దాని ప్రకారమే రోగుల నుంచి వసూలు చేయాలి. ఏలూరు పట్టణంతోపాటు, ఏ ఒక్క రక్త పరీక్షా కేంద్రం వద్ద ధరల పట్టిక లేదంటే అతిశయోక్తికాదు. ధరల పట్టికపై రోగులు అడిగినా సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. దీంతో రక్త పరీక్షలకు ఇష్టానుసారం ధరలు వసూలు చేస్తున్నారు. ఒకే పరీక్షకు ఒక ల్యాబ్‌లో ఒక ధర, మరో ల్యాబ్‌లో ఇంకో ధర ఉంటుంది. సుగర్ నిర్ధారణ టెస్ట్‌కు ఒకచోట రూ.50 తీసుకుంటే, మరో ల్యాబ్‌లో రూ.వంద, ఇంకో ల్యాబ్‌లో ఇంకోవిధంగా వసూలు చేస్తున్నారు. విటమిన్ డి, బి-12 వంటి పరీక్షలకు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. డెంగీ నిర్ధారణ పరీక్ష ప్రయివేటు ల్యాబ్‌లో చేసే అవకాశం లేదు. కానీ చాలా ల్యాబ్‌ల్లో స్థానిక వైద్యులతో కుమ్మక్కై డెంగీ ఉందంటూ రోగులను భయపెడుతున్న పరిస్థితులు సైతం కొనసాగుతున్నాయి. పలు ఆసుపత్రులతో రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు ఏకమవుతున్నారు. ప్రతి పరీక్షకూ ఆయా ఆసుపత్రులకు పర్సంటేజీ రూపంలో కమీషన్లు ల్యాబ్ నిర్వాహకులు ఇస్తున్నారు. ఈ కమీషన్ 40 నుంచి 50 శాతం వరకూ ఉంటుందని తెలుస్తోంది. దీంతో రోగుల నుంచి భారీగా దోపిడీ చేస్తున్న పరిస్థితి నెలకొంది. రక్త పరీక్షలకు సంబంధించిన ధరల నిర్ణయంపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు అసలు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో ల్యాబ్ నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా తయారవుతోంది. రక్త పరీక్షా కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు సరిగ్గా అమలుకాకపోవడంతో రోగులు భారీ దోపిడీకి గురికావడంతోపాటు, అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

నామమాత్రంగా తనిఖీలు

రక్తపరీక్షా కేంద్రాలను ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయాలి. అసలు తనిఖీలు జరుగుతున్నాయా అన్న అనుమానాలు నెలకొన్నాయి. ఏదైనా సమస్య బయటపడినప్పుడు మాత్రమే హడావుడీ చేయడం, తర్వాత వదిలేయడం ఆరోగ్యశాఖ అధికారులకు పరిపాటిగా మారిందన్న విమర్శలు విని పిస్తున్నాయి. అంతేకాకుండా ప్రతి ఏడేళ్లకోసారి రిజిస్టర్ అయిన రక్తపరీక్షా కేంద్రాలకు సంబంధించిన రెన్యువల్ చేయించుకోవాలి. నిబంధనలు ఎవరూ పాటించడం లేదు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రక్తపరీక్షా కేంద్రాలు చాలా ఉన్నట్లు జనాల్లో చర్చ సాగుతోంది. ఒకరి పేరు మీద పరీక్షా కేంద్రం రిజిస్టర్ చేస్తూ మరొకరు నిర్వహిస్తున్న పరిస్థితులు సైతం ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులతో ఆరోగ్యశాఖలోని అధికారులు కుమ్మక్కై, పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రక్తపరీక్షా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది అర్హతలపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. రక్త పరీక్షలు చేయాలంటే ఎంఎల్‌టికి సంబంధించిన డిప్లమో, బిఎస్‌సి ల్యాబ్ టెక్నీషియన్ వంటి కోర్సులు చదివిన వారు ఉండాలి. చాలా రక్త పరీక్షా కేంద్రాల్లో అర్హత లేనివారిని తక్కువ జీతాలకు నియమిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు కనీస పర్యవేక్షణ ఎందుకు చేయడంలేదో అర్థం కావడంలేదని తెలుస్తోంది. అధికారుల తనిఖీలు లేకపోవడమే ధరల పట్టిక నుంచి, సిబ్బంది నియామకం వరకూ రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు రక్తపరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించకపోతే రోగులు మరిన్ని ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



కర్నూలు నగరంలో ఎటువంటి రిజిస్ట్రేషన్లు లేకుండా, రెన్యువల్ చేయకుండా డయాగ్నొస్టిక్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ సెంటర్ల నిర్వాహకులు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నాయి. పరీక్షల నిమిత్తం వచ్చిన ప్రజలు డయాగ్నొస్టిక్ సెంటర్ల దగ్గర జేబులు ఖాళీ చేసుకుని వెళ్ళవలసిన పరిస్థితి వచ్చింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి అనుమతులు లేని, రెన్యువల్ చేయని డయాగ్నొస్టిక్ సెంటర్లను సీజ్ చేసి, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

- హుస్సేన్ బాషా, డివైఎఫ్ఐ కర్నూలు నగర కార్యదర్శి.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు
- కలెక్టరేట్ ఎదుట సహకార ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సహకార ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని స్థానిక కలెక్టర్ కార్యాలయం దగ్గర సహకార ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం నుండి ధర్నా చౌక్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం జేఏసీ నాయకులు కాజా ముద్దీన్ బాషా, గోపాల్ రెడ్డి, రహంతుల్లా నాయకత్వంలో జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎండి.అంజిబాబు మాట్లాడారు. జీవో 36ను అమలు జరిపి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను పూర్తి చేయాలని, అప్పటివరకు మధ్యంతర భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా చట్ట పరంగా చెల్లించాలని కోరారు. రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. 2019 తర్వాత చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాల ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, లేనిపక్షంలో రాజీలేని పోరాటాలకు వారు ఆందోళనకు సిద్ధమవుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సహకార ఉద్యోగులు చేసే ఆందోళనకు సిఐటియు ఎల్లవేళలా సంపూర్ణ మద్దతు తెలియ జేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు మురళీధర్ రెడ్డి, రాఘవేంద్ర, నరసింహమూర్తి, రాజేష్, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్ పిఎస్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసుల్లో పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, పురోగతిపై ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ డ్రంకెన్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు. కేసులు నమోదు చేసి శిక్షలు పడేవిధంగా చేయాలన్నారు. కార్యక్రమంలో కర్నూల్ డిఎస్‌పి జె.బాబు ప్రసాద్, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, డిసిఆర్‌బి సిఐ గుణశేఖర్ బాబు, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోపు రీ సర్వే పూర్తి

- జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రీ సర్వే, మ్యుటేషన్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఆర్డీవోలతో, తహశీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే పైలట్ ప్రాజెక్ట్ మొదటి దశలో జిల్లాలో ఎంపికైన 25 గ్రామాల్లో క్లరికల్ సవరణలను, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత కాలవ్యవధిలోపు పూర్తి చేయాలన్నారు. రెండవ దశలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన 24 గ్రామాల్లో మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేసి, ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మ్యుటేషన్‌లో పెండింగ్ లేకుండా ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి తుది ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. మూడవ దశలో ప్రారంభమైన 32 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియలో భాగంగా జీటి (గ్రౌండ్ ట్రూతింగ్) పూర్తి చేయాలన్నారు. రీ సర్వే, మ్యుటేషన్ ప్రక్రియల పురోగతిపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, తరచుగా తనిఖీలు నిర్వహించి నివేదికలను అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ, ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులకు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - వెల్దుర్తి

హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులకు తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్.రాధాకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం వెల్దుర్తిలో మోటారు వర్కర్స్ యూనియన్, బజార్ హమాలీ యూనియన్ (సిఐటియు) కార్యాలయాల వద్ద సిఐటియు జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక కార్మికులకు ఉన్న హక్కులన్నింటినీ కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రధానంగా 44 రకాల కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను నయా బానిసలుగా మార్చారన్నారు. కోట్లాదిమంది అసంఘటితరంగ కార్మికులు శ్రమ చేయడం ద్వారా మాత్రమే 140 కోట్ల మంది భారతీయులకు సేవలు, సర్వీసులు అందుతున్నాయని తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ హమాలీ కార్మికులు జీవితం మొత్తం శ్రమ చేసి పని చేస్తే వారికి ఏదైనా ఆపద వచ్చినా, వయసు పెరిగి వయోభారంతో ఉన్నప్పుడు వారిని ఆదుకోవడానికి సంక్షేమ బోర్డులు ఉపయోగపడుతుందని తెలిపారు. గతంలో భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉన్నప్పుడు కార్మికుల పిల్లలకు చదువులకు స్కాలర్‌షిప్‌లు, ప్రమాదాలు జరిగితే బీమా, గర్భిణుల డెలివరీ ఖర్చులకు డబ్బులు, చనిపోయినప్పుడు మట్టి ఖర్చులకు సంక్షేమ బోర్డు నుండి డబ్బులు ఇచ్చేవారన్నారు. అలాంటి సంక్షేమ బోర్డును మళ్లీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు అఖిలభారత మహాసభల్లో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు మారెప్ప, మండల నాయకులు కె.రాముడు, బజార్ హమాలీ యూనియన్ నాయకులు చిన్న యేసు, సత్యం, పాపారాయుడు, పెద్ద ఏసు తదితరులు పాల్గొన్నారు.



సిఐటియు జెండాను ఎగురవేస్తున్న నాయకులు



ఓర్వకల్లు ఎంపిపి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ సుధాకర్

వంద రోజుల ప్రణాళిక అమలు చేయాలి : డిఇఒ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వంద రోజుల ప్రణాళిక అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఓర్వకల్లు మండల పరిషత్ పాఠశాలను, కన్న మడకల పాఠశాలలను డిఈవో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ పరీక్షలను డిఇఒ పరిశీలించి పలు సూచనలు చేశారు. కన్నమడకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 రోజుల ప్రణాళిక అమలును అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫిజికల్ సైన్స్ స్లిప్ టెస్ట్-2 పరీక్షను పరిశీలించి సూచనలు చేశారు. అలాగే ఓర్వకల్ ఎంఆర్‌సి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాధికారి శ్రీధర్ బాబు, ఓర్వకల్ మండల విద్యాధికారి ఓంకార్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - సిబెళగల్

ప్రకృతి వ్యవసాయంపై ఎడిఎ అన్నపూర్ణదేవి మండలంలోని రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం వ్యవసాయ కేంద్రంలో ఎఒ మల్లేష్ కుమార్ అధ్యక్షతన వ్యవసాయ సిబ్బంది సమక్షంలో రైతులతో సమీక్షించి మాట్లాడారు. పంటల సాగులకు ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. భూసార పరీక్షల ఫలితంగా సాగు చేయాలని, అప్పుడే ఆశించిన దిగుబడులు సాధిస్తారని పేర్కొన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

21న పల్స్ పోలియో

- జిల్లా సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు రెండో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జరుగుతున్న పల్స్ పోలియో బూతు స్థాయి సభ్యులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడుతూ పోలియో వైరస్‌తో బాధపడుతున్న పిల్లల మలం ద్వారా శుభ్రంగా లేని చేతులు, కలుషితమైన నీరు,ఆహారము తో ఆరోగ్యవంతమైన పిల్లలకు నోటి ద్వారా పోలియో వైరస్ వ్యాపిస్తుందని అన్నారు. ఈ విధంగా శరీరంలోకి ప్రవేశించి వైరస్ నాడీ వ్యవస్థను ప్రభావం చేసి పోలియో వ్యాధి పక్షపాతాన్ని కలిగిస్తుందని, ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాలు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా ఇప్పించి పోలియో రహిత దేశాన్ని నిర్మించాలని తెలిపారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్, ఆరోగ్య విస్తరణ అధికారి క ష?మోహన్, హెల్త్ సూపర్వైజర్ కమాల్ సాహెబ్ పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 8 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాల పరిధిలోని ఐఎల్ఎమ్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి, జెకెసి కోఆర్డినేటర్ మహబూబ్ బాషా మంగళవారం తెలిపారు. ఇందులో కంపెనీ హెచ్ఆర్ ఎం.గౌస్ పాషా, సోమప్ప, జెకెసి మెంటర్స్ కె.ఈశ్వర్, బి.స్వర్ణలత పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరపాలక అధికారులు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు కార్యాలయాల్లో కూర్చుని కాదు, క్షేత్రస్థాయిలోకి వెళ్లినప్పుడే అర్థమవుతాయని తెలిపారు. మంగళవారం జొహార పురం ప్రాంతంలో ఆయన వివిధ కాలనీల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా పరిస్థితులను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో చెత్త సకాలంలో తొలగించకపోవడం, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించడంతో ఇద్దరు సానిటేషన్ కార్యదర్శులపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. పూడికతీత పనులు ఎందుకు చేపట్ట లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, డిఇఇ నరేష్, ఎఇ ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

టిడిఆర్‌ల జారీ వేగవంతం: నగరంలోని కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు చేపట్టనున్న రహదారి విస్తరణ పనులకు సంబంధించి టిడిఆర్ బాండ్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. ఉస్మానియా కళాశాల, వడ్డేగేరి ప్రాంతాల్లో రహదారుల విస్తరణకు సంబంధించిన కొలతలను కమిషనర్ పరిశీలించారు. నగరాభివద్ధిలో భాగంగా చేపడుతున్న ప్రధాన రహదారుల విస్తరణ పనులు ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రారంభించాల్సిన అవసరం ఉందని, ఇందుకు టిడిఆర్ బాండ్ల మంజూరులో పారదర్శకత, వేగం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇంస్పెక్టర్లు వేమన్‌రావు, పాల్గొన్నారు.

48వ వార్డును అభివృద్ధి చేస్తున్నాం

- రాష్ట్ర మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

నగరంలోని 48వ వార్డును అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. మంగళవారం ప్రకాష్ నగర్‌లోని విసి టవర్స్ వద్ద టిడిపి నాయకులు దేవా ఆధ్వర్యంలో క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ వేడుకలకు మంత్రి భరత్ హాజరయ్యారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... కర్నూలు నియోజకవర్గంలోని 33 వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ వెబ్‌నార్‌లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో పొలిటికల్ సైన్స్ మూడో సంవత్సరం బిఎ విద్యార్థి ఇ.లక్ష్మీ నరసింహ, 'మేధా-జాతీయ వెబనార్'లో ప్రతిభ కనబరిచారు. మంగళవారం క్లస్టర్ వర్సిటీ ఇన్‌ఛార్జీ రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్ విద్యార్థి లక్ష్మీ నరసింహను అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బిఆర్.ప్రసాద్ రెడ్డి, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ హెచ్.అక్తర్‌భాను, డీన్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ నాగరాజ్ శెట్టి, లక్ష్మీ అభినందించారు.

'ఉపాధి హామీ పేరు మార్చడం తగదు'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం తగదని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న పేర్కొన్నారు. మంగళవారం వ్యకాస ఆధ్వర్యంలో కేతవరం పంచాయతీ కార్యాలయం ముందు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి చట్టం సవరణ బిల్లుల కాపీలను కాల్చి నిరసన చేపట్టారు. నాగన్న, సిఐటియు మండల కార్యదర్శి జి.శ్రీధర్, వ్యకాస నాయకులు నాగరాజు, వెంకటస్వామి, రైతు సంఘం నాయకులు మధుసూదన్, సూర్యనారాయణ మాట్లాడుతూ... ఉపాధి హామీ చట్టం పేరును తొలగించి పూజ్యబాపూ గ్రామీణ రోజ్ ఘర్ యోజన పేరుగా మార్చడం సరికాదన్నారు. 200 రోజుల పని దినాలు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంకటరాముడు, వెంకటేశ్వర్లు, సుధాకర్ పాల్గొన్నారు.

మద్దికెరలో బాల్యవివాహ ముక్త్ భారత్

ప్రజాశక్తి - మద్దికెర

మద్దికెరలోని ప్రైమరీ స్పెషల్ స్కూల్‌లో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బాల్య వివాహ ముక్త్ భారత్' నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ త్రివేణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలపై ప్రతి అంగన్వాడీ కార్యకర్త కేంద్రం పరిధిలోని కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయడమే కాకుండా కిశోర బాలికలకు పాఠశాలల్లో తరచూ సమావేశాలు నిర్వహించి, వారికి చదువు, భవిష్యత్తు, సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయులు సీనప్ప, అరుణ జ్యోతి, సివి.మాధవి లత పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి : డిఇఇ

ప్రజాశక్తి - సి బెళగల్


విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలని విద్యుత్ డీఈఈ జెస్సన్ విద్యుత్ వినియోగదారులకు సూచించారు. మంగళవారం ఏఈఈ సుకుమార్ అధ్యక్షతన మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ వంశీ మోహన్ రావు సమక్షంలో విద్యార్థులకు విద్యుత్ పొదుపు-వినియోగంపై అవగాహన కల్పించారు. ఇళ్లలో విద్యుత్ బల్బులు, ఫ్యాన్లు, ఇతర అవసరమైన మేరకే ఆన్ చేసుకోవాలని అన్నారు. వృథాగా ఆన్ చేసుకోవడం వల్ల విద్యుత్ ఆదా కాదని, బిల్లుల భారాన్ని అధిగమించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకొని బిల్లులను ఆదా చేసుకోవాలని పేర్కొన్నారు.

రోడ్ల దోపిడీని దాచిపెడుతున్న ఇంజినీర్లు

- పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అక్టోబర్ 16న ప్రధానమంత్రి సభల కోసం నాసిరకం నిర్మాణాలతో పాటు రోడ్ల దోపిడీపై విచారణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కోరింది. మంగళవారం ప్రాంతీయ విజిలెన్స్ అధికారిణి చౌడేశ్వరికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎస్.షాహిద్, చిత్తారి వెంకట వర్మ, ఈ.పుల్లారెడ్డి, ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడారు. తమ సంఘం ప్రతినిధి బృందం ప్రధాని సభల ప్రాంతంలో పర్యటించామని తెలిపారు. ఆ సందర్భంగా రోడ్ల దోపిడీపై తీసిన ఫొటోలను అధికారికి చూపెట్టారని, రూ.కోట్లు వెచ్చించి వేసిన ఖరీదైన కంకరను ఎత్తుకు పోతుంటే సంబంధిత అధికారులు స్పందించడం లేదన్నారు. సభల అనంతరం మొత్తం కంకరను ఉపయోగించుకొని ఉంటే రోడ్లు లేని అనేక ప్రాంతాలు అభివృద్ధి అయ్యేవని తెలిపారు. రహదారుల శాఖ సూపరిండెంట్ ఇంజనీరు పెద్దపాడు రోడ్డు నాసిరకం పనులను సమర్థించినట్లుగానే ప్రధానమంత్రి సభల నాసిరకం నిర్మాణాలను, రోడ్ల దోపిడీని కూడా దాసి పెడుతున్నారని తెలిపారు. విజిలెన్స్ అధికారి మాట్లాడుతూ... ప్రధానమంత్రి సభల నిర్మాణాలపై మీడియాలో వచ్చిన సమాచారాన్ని ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. ఎమ్‌డి.యూనూస్, కె.శ్రీనివాసు, లక్ష్మణ గౌడు, ఎం.నారాయణ ఉన్నారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'ఉపాధి' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర : వ్యకాస

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, కాపాడుకునేందుకు కూలీలంతా ఐక్యం కావాలని వ్యకాస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వీరశేఖర్, కెవి.నారాయణ కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ పేదల్లో కొంతైనా ఆర్థిక వేసలుబాటు వచ్చిందని తెలిపారు. ఇప్పటికీ సగటున 50 రోజులకు మించి ఉపాధి పనులు కల్పించలేని పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని మండిపడ్డారు. పాత పద్ధతిలోనే ఉపాధి హామీ చట్టం ఉండాలని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగానే పేదలకు ఉపాధి హామీ చట్టాన్ని దూరం చేయాలని కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఈ కొత్త బిల్లులకు వ్యతిరేకంగా కూలీలంతా ఐక్యమై ఉద్యమించాలని కోరారు.

ప్యాలకుర్తిలో రైతు సదస్సు - ప్రదర్శన

ప్రజాశక్తి -కోడుమూరు

మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో మంగళవారం ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు, ప్రదర్శనను డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉద్యాన పంటల్లో రైతులకు మెళకువలు వివరించారు. ఆధునిక సాంకేతికతను జోడించి తక్కువ నీటి వసతి, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడుల ద్వారా ఆదాయం పొందేలా రైతులకు అవగాహన కల్పించారు. సస్య రక్షణ, ఎలుకల నివారణ, వర్మీ కంపోస్ట్ తయారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కొత్త టెక్నాలజీ డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారి, పత్తి పంటలో అధిక సాంద్రత పద్ధతి పాటించాలని కోరారు. భూసార పరీక్షలు నిర్వహించి ఎరువులు వాడాలని సూచించారు. విద్యార్థులు పంటలు వాటిల్లో వచ్చే కీటకం, తెగుళ్ల గురించి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు నేరుగా పొలాల్లో పని చేస్తూ శాస్త్రీయ పద్ధతులను రైతులకు పరిచయం చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాలకుర్తి గ్రామంలో ఆదిత్య రైతుల చెంతన ఉంటూ మూడు నెలల పాటు సాంకేతికత అంశాలను గమనిస్తూ ఆఖరి మజిలీ కార్యక్రమం నిర్వహించారు. పత్తి, కంది, కూరగాయలు పండించే విధానాన్ని విద్యార్థులు నేర్చుకున్నారు. వారి విజ్ఞానాన్ని రైతులకు తెలిపారు. ఎడిఎ శాలు రెడ్డి, ఎడిఎ వెంకటేశ్వర్లు, వెంకట రంగారెడ్డి, ఎఒ రవి ప్రకాష్ పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీ విద్యార్థులకు వీసీ అభినందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులను క్లస్టర్ వర్సిటీ ఇన్‌ఛార్జీ వీసీ వెంకట బసవరావు అభినందించారు. తృతీయ సంవత్సరం విద్యార్థి బి.ధరణి జానపద నృత్యంలో, ఎం.మర్రి స్వామి కథక్ నృత్యంలో, టి.సుధేష్ణ కూచిపూడి నృత్యంలో, బి.హిమబిందు భరతనాట్యంలో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో ప్రిన్సిపల్, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ వెంకట బసవరావు


డిప్యూటీ కమిషనర్ వాణికి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ఉరుకుందలో వేలం పాటలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో డిప్యూటీ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో మంగళవారం వేలంపాటలు నిర్వహించారు. దేవస్థానానికి సంబంధించిన ఖాళీ స్థలాలు, స్వామి వారికి భక్తులు సమర్పించే బెల్లం, శనగ బ్యాళ్లు, రవ్వ, మైదా పిండి, గోధుమ పిండి, పామాయిల్, చక్కెర సరుకులను పోగు చేసుకోవడానికి వేలం పాటలు ఆహ్వానించారు. రామిరెడ్డి, మోహన్-2 షీల్డ్ టెండర్ ద్వారా వేలం వేశారు. ఇందులో మోహన్ అధికంగా బిడ్ దాఖలు వేసి పాటను దక్కించుకున్నారు. పామాయిల్ ఒకటే రామిరెడ్డికి పాట దక్కింది. ఖాళీ స్థలాలకు ఎవరూ వేలం పాటలో పాల్గొనక పోవడంతో వాయిదా వేసినట్లు డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు.


ఖాళీ స్థలాలపై ఫిర్యాదు

పుణ్యక్షేత్రం పరిసరాల్లోని కోసిగి రస్తాలో 50 ఏళ్ల నుంచి గ్రామానికి చెందిన పేదలు టెంకాయ అంగళ్లు, చిన్న, చిన్న అంగళ్లు పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారని, పంచాయతీ స్థలాలను ప్రయివేట్ వ్యక్తులకు టెండర్ ద్వారా అప్పగించడం సరైన పద్ధతి కాదని సర్పంచి రాధా, మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ కొట్రేష్ గౌడ్, గ్రామస్తులు కురుగోడు, రవి డిప్యూటీ కమిషనర్ వాణికి ఫిర్యాదు చేశారు. పంచాయతీ స్థలాల టెండర్లను రద్దు చేయాలని కోరారు.

తాగునీటి సమస్య రానివ్వం

- ఎమ్మెల్యే పార్థసారధి

ప్రజాశక్తి - ఆదోని


ఎస్ఎస్ ట్యాంకు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆదోని పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. మంగళవారం మునిసిపల్ కమిషనర్ కృష్ణ, డిప్యూటీ ఇంజినీర్ చలపతి రెడ్డితో కలిసి బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సుమారు రూ.1.30 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు బండుకు మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. పనులు చేస్తూనే చెరువులో నీటిని నింపి నిల్వ చేస్తున్నారని తెలిపారు. ఆదోని ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా సకాలంలో జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. ట్యాంకు మరమ్మత్తు పనులకు నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లగానే స్పందించారన్నారు. ఐదు రోజులకొకసారి కాకుండా రోజు విడిచి రోజు నీరు వదిలేలా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. త్వరలోనే పనులు పూర్తయ్యేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డిఇఇ రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ సురేష్ ఉన్నారు.

సురక్షితమైన తాగునీరందించడమే లక్ష్యం

- టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్నగౌడ్

ప్రజాశక్తి - నందవరం

గ్రామస్తులకు సురక్షితమైన తాగునీరు అందించడమే తమ లక్ష్యమని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్ తెలిపారు. మంగళవారం ముగతి గ్రామంలో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈరన్న గౌడ్, ఎంపిడిఒ పుల్లయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బాలకృష్ణ, మండల నాయకులు రెడ్డి మిల్ నారాయణ రెడ్డి, గజేంద్ర రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో తాగునీటి సౌకర్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. వాటా ఏళ్ల క్రితం గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను నిర్మించినా ప్రజలకు అందుబాటులోకి రాలేదన్నారు. వారం రోజులుగా పనులను ప్రారంభించి ప్లాంట్ ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీకృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రవి, నందవరం చిన్నరాముడు, ముగతి భార్గవ్ యాదవ్, రామకృష్ణారెడ్డి, జగాపురం నరసింహులు, ఘట్టాల రంగన్న, బాపురం శ్రీను, ఎల్ఐసి గోపాల్, ముగతి గ్రామ అధ్యక్షులు గుగ్గిరి నరసింహులు, హాలహర్వి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, కాపు వీరారెడ్డి, ధనుంజయ యాదవ్, కొండారెడ్డి, బాలరాజు, ధర్మారెడ్డి, వీరారెడ్డి, సోమశంకర్ రెడ్డి, ఈడిగ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ కడబూరి, ఈ.నవీన్, అర్జున్ యాదవ్, ఈడిగ ఆటో రవి, బోయ ఈరన్న, హుస్సేనయ్య పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

జిల్లా సాధన ఉద్యమం మరింత తీవ్రతరం

- మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా సాధన ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తీవ్రతరం చేయాలని ఆదోని జిల్లా సాధన సమితి జెఎసి కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ తెలిపారు. ఆదోని జిల్లా సాధన కోసం పట్టణంలోని కోట్ల కూడలి వద్ద చేపట్టిన దీక్ష శిబిరం మంగళవారం 31వ రోజుకు చేరింది. ఉద్యమంలో మేము సైతం అంటూ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రఘు, చంద్రశేఖర్, ఉచ్చీరప్ప, నరసింహులు, రాము, రవి, గణేష్, చంద్రశేఖర్, నాగేంద్ర, రాజు, బసప్ప కూర్చున్నారు. జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్ష శిబిరానికి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ సంఘీభావం తెలిపారు. జిల్లా ఆవశ్యకత గురించి ప్రచారం కోసం రూ.30 వేలతో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ సొంత ఖర్చులతో రూపొందించిన స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్లకు, స్కూటర్లకు, ఆటోలకు, ఇతర వాహనాలకు ఆదోని జిల్లా కావాలంటూ స్టిక్కర్లు అతికించుకోవాలని సూచించారు. ఆదోని జిల్లా సాధించే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి ఈ ప్రాంతం కోసం ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఈ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. అనంతరం జెఎసి సభ్యులు రఘురామయ్య, నూర్ అహ్మద్, లలిత, అశోక ఆనంద రెడ్డి, కృష్ణమూర్తి, వీరేష్, దస్తగిరి, కోదండ మాట్లాడారు. ఆదోని జిల్లా సాధన ఉద్యమం ప్రజల్లోకి వెళ్లిందన్నారు. రోజువారీగా అసోసియేషన్లు, కార్మిక సంఘాలు, మహిళలు సైతం దీక్షలో కూర్చుని సంఘీభావం తెలుపుతున్నారని తెలిపారు. ఆదోని జిల్లాను ప్రకటిస్తే ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు ప్రాంత ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటామని చెప్పారు. సభ్యులు కుంకనూరు వీరేష్, గోపాల చారి, తిరుమలేష్, బాలకృష్ణ, ఉదయ్ ఉన్నారు.

ప్రజా ప్రతినిధులు ప్రజా సేవకులనే విషయం మరిచారు

మంత్రాలయం : ప్రజాప్రతినిధులు ప్రజా సేవకులనే విషయం మరిచారని ఆదోని జిల్లా సాధన సమితి జెఎసి కన్వీనర్ రామతీర్థం అమ్రేష్ విమర్శించారు. ఆదోని జిల్లా సాధన కోసం స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం 5వ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ... ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలనే బాధ్యతను విస్మరించారని పేర్కొన్నారు. విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టులు ఆర్‌డిఎస్, గుండ్రేవుల నిర్మాణం జరగాలంటే, ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రానికి మెరుగైన రోడ్డు రావాలంటే జిల్లాతోనే సాధ్యమని తెలిపారు. దీక్షకు మద్దతుగా బిఎస్ఎస్ నాయకులు బాలస్వామి, శ్యామ్సోను, ఆనంద్, ప్రసాద్, సుందర్ రాజు, సాల్మన్, దేవరాజు, లక్ష్మన్న, దేవదాసు, దేవా, ఏసన్న, విజయుడు, చిన్న బాలస్వామి, లక్ష్మన్న, సంఘీభావంగా శారద స్కూల్ ప్రధానోపాధ్యాయులు నూర్ బాషా, మంత్రాలయం దళిత నాయకులు సుందర్‌రాజు, కయ్యాన్, రాజు, సూగూరు దళిత నాయకులు దావీదు, కాలేబు, ఆదోని జిల్లా సాధన విద్యార్థి జెఎసి గౌరవ సలహాదారులు నాగరాజు, కన్వీనర్ రమేష్, కో కన్వీనర్ దస్తగిరి, తిరుమలేష్, ఉదయ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు థామస్, బూదూరు సుబ్బారెడ్డి, స్వామినాథం, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ ఆదోని డివిజన్ అధ్యక్షులు చార్లెస్, బిఎస్ఎస్ జిల్లా కన్వీనర్ ప్రసన్న కుమార్, మాల మహానాడు ఉసేని, చిన్న స్వామి దాసు, దేవా, సుధ, సామేలు, దావీదు, ప్రభుదాస్, రత్నమయ్య, జాన్ మద్దతు తెలిపారు.

ఆదోని జిల్లా సాధనకు ఉద్యమించాలి

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరులోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఆదోని జిల్లా సాధన సమితి జెఎసి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు 7వ రోజుకు చేరాయి. దీక్షకు మద్దతుగా ఎంపిజె నాయకులు ఖాదిర్, ఇస్మాయిల్, షాషావలీ, చాందన్న, వసుంధర, పరశురాం, మహేష్, బాబా అబ్దుల్, రహీం, అజీమ్ కూర్చున్నారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రుద్ర గౌడ్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాజీవ్ రెడ్డి, బిజెపి నాయకులు నందవరం గురురాజా స్వామి మద్దతు తెలిపారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఆదోని జిల్లాను ఏర్పాటు చేయకపోతే వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ మోహన్ రెడ్డితో మాట్లాడి ఆదోని జిల్లాగా ఏర్పాటు చేస్తామని రాజీవ్ రెడ్డి తెలిపారు. జెఎసి నాయకులు గణేష్, ఉదయ్, శేఖర్, కృష్ణ, ఆఫ్రిది, ఖాజా, రఘు, బతుకన్న, బలరాం, బాబులాల్, స్వామి దాసు, నగేష్, నల్లన్న, రఫీ పాల్గొన్నారు.


ఆదోనిలో జిల్లా ఆవశ్యకత సూచించే స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు


మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు


ఎమ్మిగనూరులో మద్దతు తెలుపుతున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎర్రకోట రాజీవ్ రెడ్డి

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - దేవనకొండ

యువతను బానిసలుగా, వ్యసనపరులుగా మార్చే మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో యువత ముందుండాలని డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు మహేంద్ర, ఉపాధ్యక్షులు కెవి.నాగేంద్ర, వీరేంద్ర నాయుడు తెలిపారు. మంగళవారం దేవనకొండలో మండల ఉపాధ్యక్షులు జిఎన్ఆర్.నాగేంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొంతమంది స్వలాభం కోసం చేస్తున్న డ్రగ్స్, గంజాయి వ్యాపారాల వల్ల యువత


సమావేశంలో మాట్లాడుతున్న మహేంద్ర

బానిసలుగా మారి సమాజానికి, కుటుంబానికి వ్యతిరేకంగా మారుతున్నారని, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అంతర్గత రోడ్లు అధ్వాన్నస్థితిలో ఉన్నాయని, గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక, సరైన విద్యుత్ సదుపాయం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. త్వరలో అన్ని గ్రామాలలో సర్వే చేసి మండల వ్యాప్తంగా దశలవారీ ఆందోళనకు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. మండల నాయకులు రవితేజ, రంగస్వామి, రాముడు, లోకయ్య పాల్గొన్నారు.

శ్రీమఠంలో అన్నదానానికి రూ.2.25 లక్షల విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో కొనసాగుతున్న అన్నదానానికి భక్తులు రూ.2.25 లక్షలు విరాళం వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఆర్.సందేశ్ రూ.1.25 లక్షలు, కర్ణాటక రాష్ట్రం కుందాపూర్‌కు చెందిన దుర్గా పరమేశ్వర ట్రేడర్స్ వారు రూ.లక్ష విరాళంగా ఇచ్చారని చెప్పారు. దాతలకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్ర తీర్థులు శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించినట్లు పేర్కొన్నారు.

ఆదోని తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఆదోని రూరల్



ఆదోని తహశీల్దార్‌గా శేషఫణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రమేష్‌ను కర్నూలు కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. శేషఫణి ఎమ్మిగనూరులో పనిచేస్తూ ఇటీవల పలు ఆరోపణలపై కలెక్టరేట్‌కు సరెండర్ చేశారు. బదిలీలో భాగంగా కలెక్టర్ డాక్టర్ సిరి ఆదోనికి కేటాయించారు. తన వద్దకు వచ్చిన ఎటువంటి భూ సమస్యనైనా పరిష్కరించేందుకు కృషి చేస్తానని శేషఫణి తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని, ప్రజలు సమస్యలపై దళారులను సంప్రదించకుండా నేరుగా తహశీల్దార్‌ను కలవాలని సూచించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రఘురామిరెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి నూకరాజు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రఘురామిరెడ్డి కోరారు. మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 21న మొదటి రోజు బూత్‌ల వారీగా పిల్లలకు పోలియో చుక్కలు వేసి పిల్లల ఎడమ చేతి చిటికెన వేలుకు మార్కర్ ద్వారా గుర్తు పెట్టాలని తెలిపారు. మరుసటి రోజు ఇంటింటికీ మార్కింగ్ వేసే విధానం గురించి శిక్షణ నిర్వహించారు. వ్యాక్సిన్‌ను ఏ దశలో వాడాలో, ఎలా వాడరాదో వ్యాక్సిన్ వాయిల్ మానిటర్ గురించి వివరించారు. పల్స్ పోలియో గురించి మండల ప్రజలకు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని తెలిపారు. పోలియో చుక్కలు వేసుకోకుండా మిగిలి పోయిన పిల్లలకు 22, 23వ తేదీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి వేయాలన్నారు. డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కల్యాణ్, సిహెచ్ఒ భాగ్యలక్ష్మి, ఎంపిహెచ్ఎఒ రంగస్వామి, సూపర్‌వైజర్లు మద్దిలేటి, జయలక్ష్మి పాల్గొన్నారు.


దేవనకొండలో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ రఘురామిరెడ్డి

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

చిప్పగిరి : ఈనెల 21న జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి పూర్తి చేసేందుకు కృషి చేయాలని ప్రభుత్వ డాక్టర్ అఫ్రోజ్ జహాన్, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు సూచించారు. చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశా సిబ్బందికి, వైద్య సిబ్బందికి పల్స్ పోలియోపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ పుట్టిన పిల్లల దగ్గర నుంచి 5 ఏళ్ల పిల్లల వరకు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదేశాల మేరకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని తెలిపారు. అంగన్వాడీలు, ఆశాలు, వైద్య సిబ్బంది సమన్వయం చేసుకొని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని తెలిపారు. నేటి నుంచి పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన, పాఠశాల పిల్లలతో కలిసి ర్యాలీలు నిర్వహించాలని చెప్పారు. పబ్లిక్ హెల్త్ నర్స్ షాహిదా బేగం, స్టాఫ్ నర్స్ చంద్రకళ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ అఫ్రోజ్ జహాన్

సిఎం దృష్టికి ఆదోని జిల్లా అంశం

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా అంశం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని, అందుకు ఏర్పాట్లు చేస్తామని టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి తెలిపారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి మీనాక్షి నాయుడు స్వగృహంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, జెఎసి నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడారు. ఆదోని జిల్లా అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. ఇక్కడ ప్రజల అభిప్రాయం మేరకు ప్రభుత్వం అనుకూలంగా ఉందని, వైసిపి హయాంలో ఆదోని జిల్లాను చేయకుండా అప్పట్లో పాలకులు మోసం చేశారని దుయ్యబట్టారు. ఆదోని అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రిని కలవడానికి అపాయింట్‌మెంట్ తీసుకుంటామని హామీ ఇచ్చారు. జెఎసి నాయకులు లలిత, నూర్ అహ్మద్, రఘురామయ్య, కృష్ణమూర్తి, కోదండ, వీరేష్, దస్తగిరి నాయుడు, కుంకనూరు వీరేష్, గణేకల్ విరుపాక్షి, అశోకనంద రెడ్డి ఉన్నారు.


జెఎసి నాయకులతో మాట్లాడుతున్న తిక్కా రెడ్డి


గోడపత్రికలను విడుదల చేస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకరం

- ఎంపిడిఒ వరలక్ష్మి

ప్రజాశక్తి - హాలహర్వి

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలు లాభదాయకంగా ఉంటాయని ఎంపిడిఒ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం స్త్రీ శక్తి భవనంలో ఎపిఎం నాగర్జున ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... రైతులు క్రిమిసంహారక మందులు వాడకుండా ఆవు పేడ, వానపాముల ద్వారా తయారు చేసిన ఎరువును పంటలకు వేయాలని తెలిపారు. మండలంలో 9 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన అధికారులు ఉన్నారని, వారు గ్రామాల్లోకి వచ్చి సర్వే నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం గ్రామాల్లో మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని, లేని వారికి కొత్తగా మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఆర్‌వైఎస్ఎస్ మండల ఇన్‌ఛార్జీ రాజేశ్వరి, ఎంఇఒ ఈరన్న, సిసిలు ఆంజనేయులు, నరసన్న, నరసింహులు, వెంకటరత్నం, అకౌంటెంట్ నరసింహులు పాల్గొన్నారు.

'సంతృప్తికరమైన సమాధానమివ్వాలి'

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ కార్యాలయాలకు సమస్యలతో కూడిన దరఖాస్తులు తీసుకొచ్చే వారందరికీ సంతృప్తికరమైన సమాధానం ఇచ్చే విధంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ అధికారులకు, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఎంపిడిఒ అల్లాబకాష్ సూచించారు. మంగళవారం మండల కార్యాలయంలో 13 పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులకు జిఎస్‌డబ్ల్యుఎస్ అవగాహన, యుఎఫ్ఎస్ ట్రైనింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆదేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. సకాలంలో పూర్తి చేయకపోతే కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ప్రతి పంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శులతో పాటు సచివాలయ సిబ్బంది సమన్వయం చేసుకొని సర్వేలు పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాస్ రెడ్డి, ట్రైనింగ్ పొందిన పంచాయతీ కార్యదర్శి బాలన్న, విఆర్ఒలు వన్నూరు, సుభద్ర పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన రైతు చంద్ర శేఖరయ్య స్వామి గడ్డివామి మంగళవారం దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఎవరైనా కావాలని చేశారా లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనేది తెలియడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పక్కన ఉన్న రైతులు, గ్రామస్తులు బావుల్లో ఉన్న నీరు, బోర్లలో ఉన్న నీటితో మంటలను ఆర్పేశారు. అలాగే మరి కొంతమంది రైతులు తమ పొలాలకు వాడుతున్న స్ప్రేర్ పంపుల్లో నీరు పోసి ఆర్పేశారు. మూగజీవాల కోసం ఉన్న గడ్డి దగ్ధం కావడంతో రైతు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



రేషన్ బియ్యం లారీ పట్టివేత

ప్రజాశక్తి - మంత్రాలయం


లారీని పట్టుకున్న పోలీసులు

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని ఎక్సైజ్, మాధవరం పోలీసులు మంగళవారం పట్టుకున్నట్లు సిఐ రామాంజులు, ఎక్సైజ్ శాఖ సిఐ ప్రసాద్ రావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. ఆదోని పట్టణానికి చెందిన వ్యాపారికి సంబంధించిన లారీ మాధవరం చెక్ పోస్టు మీదుగా ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తుండగా చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న ఎస్‌కె.మహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి సతీష్ లారీని తనిఖీ చేశారని, పిడిఎస్ బియ్యంగా గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. డ్రైవర్ షేక్ లాల్ కులదీప్, క్లీనర్ రితిక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన రేషన్ బియానికి ఆర్ఐ జనార్ధన్ రావు, ఎక్సైజ్ సిఐ సమక్షంలో పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


భూమిపూజ చేస్తున్న నాయకులు

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి


- పిఎసిఎస్ ఛైర్మన్ ధర్మపురం గోపాల్ - మినీ గోకులం షెడ్లు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - నందవరం

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని వ్యవసాయ పిఎసిఎస్ ఛైర్మన్ ధర్మపురం గోపాల్ తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మపురం గ్రామంలో ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మినీ గోకులం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ధర్మపురం గోపాల్ మాట్లాడారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు పాడి పరిశ్రమలో అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం సహకారమందిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలో రూ.కోట్ల వ్యయంతో వందల సంఖ్యలో మినీ గోకులాల నిర్మాణం చేపట్టామన్నారు. ధర్మపురం గ్రామానికి 5 మినీ గోకులాలు వచ్చాయని తెలిపారు. మినీ గోకలాల నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు, ధర్మపురం గోపాల్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈసీ జి.శ్రీనివాసులు, చంద్రశేఖర్, రంగస్వామి, జీవన్, మైరాముడు, చిన్న గోవిందు, రంగన్న, మద్దిలేటి పాల్గొన్నారు.

'పట్టాలిచ్చిన పేదలకు స్థలాలు చూపించాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


పట్టాలు చూపి నిరసన తెలియజేస్తున్న నాయకులు

పట్టణంలో 19ఎ, 20 సర్వే నెంబర్లలో గత ప్రభుత్వం పేదలకు పట్టాలిచ్చిందని, స్థలాలు చూపించలేదని, తహశీల్దార్, అధికారులు స్పందించి స్థలాలు చూపించాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో స్పందన పేరుతో పేదలను మోసం చేశారని, ప్రస్తుత ప్రభుత్వం పేదల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడం సరైంది కాదని తెలిపారు. 2020వ సంవత్సరంలో ఇచ్చిన పట్టాలకు స్థలాలు ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. 19ఎ, 20 సర్వే నెంబర్లు కోర్టు సమస్య ఉందని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ జోక్యం చేసుకొని పేదలకు ఇచ్చిన పట్టాలకు స్థలాలు చూపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులు సుజాత, పెద్ద గంగమ్మ, రామకృష్ణ, భాస్కర్, బాబు, రామన్న పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం నుంచి 7వ సారి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల పక్షపాతి అని, ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తూనే ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామని కొనియాడారు. టిడిపి మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, భాస్కర్ రెడ్డి, కోసిగి మండల ఇన్‌ఛార్జీ ముత్తురెడ్డి, మండల అధ్యక్షులు రామిరెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్సిరెడ్డి, తోవి రామకృష్ణ, వక్రాణి వెంకటేష్, కౌతాళం మండల నాయకులు సతీష్ నాయుడు, పెద్దకడబూరు మండల నాయకులు అంజి, కందనాతి నర్సప్ప, మురళీ, మల్లి పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు మహదేవప్ప

ప్రజాశక్తి - ఆదోని



విద్యారంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు మహదేవప్ప తెలిపారు. రాష్ట్ర కార్యవర్గంలో తనకు చోటు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఎస్‌టియు 79వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఈనెల 13, 14వ తేదీల్లో కడప పట్టణంలో జరిగినట్లు తెలిపారు. ఆదోని మండలానికి చెందిన తనను రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. ఎన్నిక పట్ల ఎస్‌టియు ఆదోని, కౌతాళం మండలాల నాయకులు అభినందనలు తెలిపారు.

లైంగిక వేధింపుల పట్ల అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ ఉమాదేవి

ప్రజాశక్తి - బనగానపల్లె

బాలల లైంగిక వేధింపుల పట్ల అవగాహన కల్పించాలని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ ఉమాదేవి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో బాలల లైంగిక వేధింపులపై చట్టాలు, మానసిక ఆరోగ్య నైపుణ్యంపై ఎంఈఓలకు, ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, ఐసిడిఎస్ సూపర్వైజర్లకు, సచివాలయ మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవి మాట్లాడారు. బాలికలకు లైంగిక వేధింపులపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలన్నారు. ఎన్‌సిడిసిడి జిల్లా కార్యక్రమ బాధ్యులు డాక్టర్ కాంతారావు నాయక్, మానసిక వైద్యులు డాక్టర్ శరత్ చంద్రలు సెల్ ఫోన్లు, సోషల్ మీడియా, బాలల చట్టాలు, ఫోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్యులు శైలజ, క్లినికల్ సైకాలజిస్ట్ కేజీయా రాణి, సోషల్ వర్కర్ వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గంలోని ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సచివాలయ మహిళా పోలీసులు, ప్రాంతీయ వైద్యశాల నర్సింగ్ సిబ్బంది, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ సిబ్బంది పాల్గొన్నారు .

విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి -కోడుమూరు

రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న, జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి కోరారు. మంగళవారం కోడుమూరులో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరేంద్ర, అల్తాఫ్ బాషా, మండల నాయకులు మునిస్వామి, మహేంద్ర, సాయి పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - మద్దికేర

స్నేహితులు కేవలం సుఖాల్లోనే కాదు కష్టాల్లో కూడా తోడుంటామని నిరూపించారు. మిత్రుడు కుటుంబానికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. మండల కేంద్రమైన మద్దికేర గ్రామానికి చెందిన గద్దల అరుణ్ కుమార్ అనారోగ్యంతో మ తి చెందగా, మిత్రుని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని 2003-2004 ఎస్ఎస్‌సి బ్యాచ్ మిత్రులు, తమ వంతు సహాయంగా ప్రధానోపాధ్యాయులు, సత్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం అతని భార్యకు రూ.50వేలు అందజేశారు. తమ ఆత్మీయ స్నేహితునికి ఘన నివాళులు అర్పించారు. భవిష్యత్తులోనూ అతను భార్య పిల్లలకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. అరుణ్ స్నేహితులను మద్దికేర గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి మిత్రులు నాగార్జున, వర్ధ రాజు, రాజ్ కుమార్, నల్ల గట్ల, ప్రసాద్, రాము, యువరాజు, రంగ స్వామి, కేశవ రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

విజ్ఞాన్ భారత్‌లో రాష్ట్రస్థాయికి జివిఆర్ విద్యార్థి

ప్రజాశక్తి-కోడుమూరు

పట్టణంలోని జివిఆర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి విక్రమ్ కృష్ణ 'విజ్ఞాన్ భారత్'లో భాగంగా కౌశల్ పోస్టర్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 27న తిరుపతిలో జరిగే పోటీల్లో పాల్గొంటున్న ప్రధానోపాధ్యాయులు రామచంద్రుడు తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందించారు. రాష్ట్రస్థాయి విజ్ఞాన్ భారత్‌లో పాల్గొనే విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఒక్కొక్కరు రూ.500 ఆర్థిక సహాయం చేసి, రాష్ట్రస్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు.

అబ్దుల్ కలాం బోధనలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - బనగానపల్లె

అబ్దుల్ కలాం బోధనలు ప్రపంచానికి ఆదర్శనీయమని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చెరుపల్లె ఉర్దూ పాఠశాలలో జెకెఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పొద్దుటూరు పట్టణానికి చెందిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు చక్రవర్తి సహకారంతో విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం అబ్దుల్ కలాం విశిష్టత విద్యా విశిష్టతపై సదస్సు ఏర్పాటు చేశారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద ఆచారి మాట్లాడుతూ చదువుకు ధనిక పేద అని తేడా ఏమీ లేదని, కష్టపడితే దేన్నైనా సాధించవచ్చని నిరూపించిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.నిషార్ అహ్మద్, మొహమ్మద్ హుస్సేన్, భాష, రహీం, సుబ్బరాయుడు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నంద్యాల

విద్యార్థులకు డ్రగ్స్ పదార్థాలకు దూరంగా ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కాలేజ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్, గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ఈగిల్ టీమ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహనా సదస్సులు నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, ఈగల్ టీం ఉమ్మడి జిల్లా సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవచ్చని వివరించారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శంకర్ నాయక్, రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ సభ్యులు డాక్టర్ అరుణ కుమారి, జిల్లా కమిటీ సభ్యులు, మెంబర్ వసుంధర దేవి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శైలేంద్ర, రోటరీ ఇన్నర్ వీల్ చైర్మన్ మల్లీశ్వరి, గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ కోఆర్డినేటర్ సుబ్బారావు, ఈగల్ సిబ్బంది సుజన్ కుమార్, మాసూం వలి, ప్రసాదు, మనోహర్ పాల్గొన్నారు.

అహోబిలంలో వైభవంగా స్వాతి వేడుకలు


సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో లక్ష్మీ నరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ధనుర్మాస పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లమల అరణ్యంలో వెలసిన నవనరసింహులకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తెల్లవారుజామున నుండే నవనారసింహులను దర్శించుకునేందుకు కాలినడకన తరలి వెళ్లారు. కాలినడక భక్తుల కోసం పావన, వరాహ, అహోబిల, యోగానంద తదితర క్షేత్రాలలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దిగువ అహోబిల రంగ మండపంలో ఉత్సవ మూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుదర్శన హోమం నిర్వహించారు.

500 మంది సాధువులకు దుప్పట్లు పంపిణీ..

స్వాతిని పురస్కరించుకొని అహోబిల క్షేత్రం యోగి వేమారెడ్డి నిత్యాన్నదాన సత్రం తరపున సంఘ సభ్యులు, అహోబిలం ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యుల చేతుల మీదుగా 500 మంది సాధువులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

నేడు జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిక అధికారి బి.రాధిక మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాన్యువల్ స్కావెంజర్లుగా నియామక నిషేధం, వారి పునరావాస చట్టం 2013 గురించి కలెక్టర్ కానారేన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించనున్నామని తెలిపారు.

ఘనంగా స్వాతి వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణ శివారులో రవ్వలకొండపై చెంచులక్ష్మి సమేత పవన నరసింహ స్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్ర వేడుకలు అర్చకులు బాలిశెట్టి పావన నరసింహమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, తులసి మాల, తులసి దళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

54వ సారి గుండా రవికుమార్ రక్తదానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

దివంగత మాజీ ఎమ్మెల్యే భూమా శోభా నాగిరెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు గుండా రవికుమార్ రక్తదానం చేశారు. 54వసారి రక్తదానం చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత గుండా రవిని అభినందించి సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు.

బిసి సదస్సులో ఆళ్లగడ్డ జెఎసి కన్వీనర్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విజయవాడలో లెమన్ హొటల్ నందు మంగళవారం జరిగిన బీసీ సదస్సులో ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల భాష పాల్గొని ప్రసంగించారు. బీసీవై పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్రయ్య యాదవ్ పిలుపుమేరకు నంద్యాల జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు ఇంటి వెంకట సుబ్బయ్య యాదవ్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. బీసీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బండారు నాగేశ్వరరావు, హెూమియోపతి డాక్టర్ జి వెంకట నరసయ్య, బీసీ సంఘం ఉపాధ్యక్షుడు రఘు రాముడు పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగుల వారోత్సవాలు

ప్రజాశక్తి - రుద్రవరం

స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వికలాంగుల 66వ వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో భాగ్యలక్ష్మి, వైసీపీ నాయకుడు బైరి బ్రహ్మం హాజరై మాట్లాడారు. మండలంలోని వికలాంగులందరికీ పింఛన్లు మంజూరు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనికి ఆహార పథకంలో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల ఆదరణ సేవా సమిత్ రాష్ట్ర అధ్యక్షులు మరియదాసు, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు శివనాగమ్మ, ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.సుధాకర్, మండల అధ్యక్షుడు అబ్దుల్ రహిమాన్, సెక్రెటరీ సత్తార్, గ్రామ అధ్యక్షులు బాల ఎల్లప్ప, డిపి మస్తాన్వలి, రంగస్వామి రంగనాయకులు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో పశు సంవర్ధక శాఖను బలోపేతం చేసేందుకు ఐఎఎస్ అధికారిని డైరెక్టర్‌గా నియమించాలని ఎపి నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ ఛైర్మన్ జి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం పశుసంవర్ధక శాఖ గోకులం సమావేశం మందిరంలో ఎపి నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జివిఎ విఎల్ఒ అసోసియేషన్‌లో ఖాళీగా ఉన్న కార్యదర్శి పోస్టుకు కె.రాముడు, వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు కె.బాబురావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ వెల్లడించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పశు సంవర్ధక శాఖ ఉద్యోగులను పని ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. ఎల్ఎస్ఎ అసోసియేషన్ అధ్యక్షులు జిసి.సుబ్బరాయుడు, కార్యదర్శి మహేశ్వరి, విఎ అసోసియేషన్ అధ్యక్షులు స్రవంతి హనుమంతు, కోశాధికారి రామకృష్ణ, ఆదినారాయణమ్మ, టి.సులోచన, తిరుపతమ్మ, మహేశ్వరమ్మ, జి.బజారి, పి.వరప్రసాద్ పాల్గొన్నారు.

పేదల కడుపు కొడితే సహించం..

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కొత్త చట్టం ముసుగులో పేదల కడుపులు కాల్చే కుట్రలను సహించేది లేదనీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో కొత్త చట్టాన్ని రూపకల్పన చేస్తున్నామని నిన్న పార్లమెంట్లో ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ అనే బిల్లును తీసుకువచ్చి పేదల కడుపులు కాల్చే కుట్రలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతున్నదని ఈ చర్యను తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం కోసం భవిష్యత్తులో వ్యవసాయ కార్మిక సంఘాలతో పాటు ఇతర ప్రజా సంఘాలను కూడగట్టి ఐక్య ఉద్యమాలు చేస్తామని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పాదరక్షలు పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తులకు ముంగళవారం పాదరక్షలు పంపిణీ చేసారు. ప్రభుత్వ వైద్యులు అంజలీ నలుగురు కుష్టు వ్యాధిగ్రస్తులకు ఎంసీఆర్ పాదరక్షలను అందజేసారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.